హంస వాహనంపై ఖాద్రీశుడు

నేడు సింహవాహన సేవ

కదిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలలో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి మంగళవారం హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజలు, హోమం నిర్వహించిన అనంతరం శ్రీవారిని మాడ వీధులలో ఊరేగించారు. సంధ్యా సమయంలో శ్రీవారు హంసవాహనంపై తిరువీధుల్లో విహరించారు. శ్రీవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. స్వామి వారు బుధవారం సింహవాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.




హంస వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

భూసేకరణ వేగవంతం చేయాలి

కలెక్టర్ టీఎస్ చేతన్



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్

పుట్టపర్తిటౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణానికి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో మంగళవారం 342, 716జీ రహదారుల భూసేకరణ పనుల పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. భూనిర్వాసితులకు పరిహారం చెల్లింపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, నేషనల్ హైవే అధికారులు అశోక్‌కుమార్, ముత్యాలరావు, నాగరాజు, సుజాత, తహసీల్దార్లు మారుతి, కళ్యాణ్‌చక్రవర్తి, సురేష్‌బాబు, షహబుద్దీన్ పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు తప్పక పాటించాలి: కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను తప్పక పాటించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఓటరు నమోదు, జిల్లా ఎన్నికల అధికారి, ముఖ్య ఎన్నికల అధికారి స్థాయిలో పరిష్కారంకాని సమస్యల కోసం ఏప్రిల్ 30నాటికి అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి భారత ఎన్నికల సంఘం సూచనలు ఆహ్వానించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా రాజకీయ పార్టీలకు లేఖలు పంపామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా చర్చలు సాగిస్తున్నామన్నారు. సమావేశాల్లో ఇచ్చే సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఈనెల 31లోపు కమిషన్‌కు నివేదికను సమర్పించనున్నట్లు చెప్పారు. ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించడానికి రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి సూచనలు, సలహాలు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తి రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి.. ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే.. నియోజకవర్గ సమస్యలపై గళం వినిపించారు. నియోజకవర్గంలో 116 అంగన్‌వాడీ సూపర్ వైజర్ పోస్టులు ఉండగా.. 55 మంది మాత్రమే పనిచేస్తున్నారన్నారు. మిగతా పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నియోజకవర్గంలో 451 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయనీ, వాటిలో 250 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. వాటికి సొంత భవనాలు నిర్మించాలని కోరారు. వైసీపీ హయాంలో ఆగిపోయిన వాటికి నిధులు మంజూరుచేసి, నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే ప్రశ్నకు సంబంధిత మంత్రి గుమ్మడి సంధ్యారాణి బదులిస్తూ.. పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గంలోని 193 చెరువులను హంద్రీనీవా నీటితో నింపే ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ తయారు చేశారా, ఎప్పటిలోగా పూర్తి చేస్తారని సంబంధిత మంత్రి దృష్టికి ఎమ్మెల్యే సింధూరా రెడ్డి తీసుకెళ్లారు.

పూలది ముళ్లబాట..!

దారుణంగా పడిపోయిన కనకాంబరం ధరలు

కిలో రూ.వందలోపే..

కూలి మాత్రం రూ.120

తీవ్రంగా నష్టపోతున్న రైతులు



పరాకువాండ్లపల్లి వద్ద సాగు చేసిన కనకాంబరం తోట

తనకల్లు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కిలో కనకాంబరం పూల ధర దాదాపు రూ.100. అయితే కూలి మాత్రం రూ.120 ఉంది. దీంతో పూలను తోటల్లోనే వదిలేయలేక గిట్టుబాటు కాకపోయినా, కోసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. గతేడాది వినాయకచవితి పండుగ దాకా కిలో కనకాంబరాల ధర రూ.వెయ్యి దాకా ఉండేది. దీంతో మండలంలోని వివిధ గ్రామాల్లో వంద ఎకరాలకు పైగా కనకాంబరం సాగుచేశారు. పంట బాగా వచ్చింది. పూలు కాయడం ప్రారంభమైంది. హఠాత్తుగా ధర పడిపోయింది. మండల రైతులు ప్రతిరోజూ పూలు కోసి కదిరి మార్కెట్‌కు తరలిస్తారు. పూలు కోయడానికి కూలీకి రూ.వంద నుంచి రూ.120 వరకు కూలి చెల్లిస్తున్నారు. మార్కెట్‌లో ధర మాత్రం కిలో పూలకు రూ.80నుంచి వందలోపే పలుకుతోంది. మార్కెట్‌లో కమీషన్లు, రవాణా చార్జీలతోపాటు కిలోకు వంద గ్రాముల తరుగు తీస్తున్నారు. ఈకారణంగా కనకాంబరం రైతులు నష్టాలను చవిచూస్తున్నారు.

నష్టాలు వచ్చినా తప్పదు..



రెండు ఎకరాల్లో కనకాంబరం పూలు తోట సాగు చేశా. ఎకరం సాగు చేయడానికి ఎరువులు, నారు, కూలీలు, అన్ని కలుపుకుని పూలు కోతకు వచ్చేలోపు రూ.లక్ష ఖర్చు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ధరలు పడిపోయాయి. పూలు కోయడానికి రూ. వంద నుంచి 120లు చెల్లిస్తున్నాం. మార్కెట్‌లో పూల ధర రూ.80నుంచి వంద వరకు ఉంది. నష్టాలు వస్తు న్నా, పూలను తోటలో అలాగే వదిలివేయలేక కోసి మార్కెట్‌కు తరలిస్తున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

-వెంకటరెడ్డి, పరాకువాండ్లపల్లి

ఉపాధిని అనుసంధానించాలి..



కనకాంబరం పూలు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. ప్రభుత్వమే పూల మార్కెట్లు ఏర్పాటు చేసి, కొనుగోలు చేయాలి. టమాట రైతులను ఆదుకున్నట్లే కనకాంబరం రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలి. లేదా ఉపాధి కూలీలను పూలు కొయడానికి అనుసంధానం చేయాలి. ఇతర పంటల్లో నష్టాలు రావడంతో కనకాంబరం సాగు చేశాను. దీంట్లో కూడా కూడా నష్టాలు వస్తే ఇంకేమి సాగుచేయలో అర్థం కావడంలేదు.

-పెద్దిరెడ్డి, పటమటివారిపల్లి

రూ.పది లాభం..!

● బ్రాండ్ ఏదైనా అదనపు ధర ● సోమందేపల్లిలో మద్యం సిండికేట్



వాల్మీకి సర్కిల్‌లో ఉన్న మద్యం షాపు



అధిక ధరలకు.. మద్యం సిద్ధం..

సోమందేపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తుండటంపై మద్య పాన ప్రియులు మండిపడుతున్నారు. ఎమ్మార్పీపై అదనంగా పదిరూపాయలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. రాయల్‌స్టాగ్ క్వార్టర్ ధర రూ.230ఉండగా రూ.240కి కొనుగోలు చేశామన్నారు. ఎంసీ రూ.190 ఉండగా రూ.200కు, ఇంపీరియల్ బ్లూ రూ.190ఉండగా రూ.200కు, ఓడ్కా రూ.230 నుంచి రూ.240కి ఇలా ప్రతి క్వార్టర్ బాటిల్ పైనా అదనంగా రూ.10 వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. అదేవిధంగా అన్ని రకాల బీరు బాటిళ్లపైనా రూ.10 అధికంగా వసూలు చేశారు. ఇదేమని షాపు నిర్వాహకులను అడిగితే ప్రభుత్వం మద్యం ధరలు పెంచిందని, కొత్తరేట్లకు సంబంధించి ఉత్తర్వులు వెలువడినట్లు చెబుతున్నారని మందుబాబులు వాపోయారు. సవరించిన మద్యం ధరలకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడకుండానే జనాలను మభ్య పెడుతూ వారి నుంచి అధికంగా వసూలు చేస్తున్న షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కొత్త ధరలకు సంబంధించి లేబుల్ బాటిల్‌పై ముద్రించేంతవరకు పాతధరలకే మద్యాన్ని విక్రయించాల్సి ఉంటుంది. సోమందేపల్లికి చెందిన మూడు మద్యం షాపుల నిర్వాహకులు సిండికేట్ అయ్యి అధిక ధరలకు మద్యం విక్రయాలు జరపుతున్నారు. సంబంధితశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

చర్యలు తప్పవు..

బాటిల్‌పై ఉన్న ఎమ్మార్పీకంటే అధిక ధరకు మద్యంవిక్రయిస్తే చర్యలు తప్పవు. మద్యం ధరల పెంపుపై అధికారికంగా ఉత్తర్వులు వెలువడలేదు. కొత్త లేబలింగ్ వచ్చేంతవరకు పాత ధరలకే మద్యం విక్రయించాలి. దాన్ని అతిక్రమిస్తే షాపు యజమానులపై చట్టపరమైన తీసుకుంటాం.

- సృజన్‌బాబు, సీఐ

ఉష్ణోగ్రతలు



గరిష్ఠం	34.0
కనిష్ఠం	22.0

543 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు 543 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ రఘునాథరెడ్డి తెలిపారు. 12,320 మందికిగాను 11,877 మంది పరీక్షలు రాశారన్నారు. 443 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ పరీక్ష 1642 మందికిగాను 1542 మంది రాశారనీ, 100 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ తెలిపారు.



	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.34 బుధవారం సాయంత్రం	5.08 గురువారం ఉదయం
కదిరి	6.30 బుధవారం సాయంత్రం	5.11 గురువారం ఉదయం
ధర్మవరం	6.33 బుధవారం సాయంత్రం	5.07 గురువారం ఉదయం
హిందూపురం	6.33 బుధవారం సాయంత్రం	5.15 గురువారం ఉదయం
పెనుకొండ	6.33 బుధవారం సాయంత్రం	5.15 గురువారం ఉదయం

కదిరి అభివృద్ధికి లోకేశ్ హామీ

శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించినందుకు ధన్యవాదాలు

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరపున హాజరై, పట్టువస్త్రాలు సమర్పించినందుకు మంత్రి నారా లోకేశ్‌కు పట్టణ ప్రజల తరపున ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్నివర్గాల సహకారంతో స్వామివారి కల్యాణోత్సవం విజయవంతమైందని అన్నారు. ఖాద్రీశుడి కల్యాణానికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించేలా అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవో తెచ్చిందని గుర్తు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా మంత్రి నారా లోకేశ్ స్వామివారి వద్ద వస్త్రాలు సమర్పించి, సంకల్పం తీసుకున్నారని తెలిపారు. కదిరి అభివృద్ధికి అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కదిరిలో టెంపుల్ టూరిజం సర్క్యూట్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. దీనికి అవసరమైన నిధులను సమకూరుస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. కదిరి మీదుగా గ్రీన్‌ఫీల్డు హైవే, ముద్దనూరు, కోడూరు నాలుగులైన్ల రహదారి సిద్ధమవుతున్నాయని, పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలని మంత్రి లోకేశ్‌ను కోరామని తెలిపారు. హంద్రీనీవా ద్వారా అన్ని చెరువులకు నీరు అందిస్తామని అన్నారు. గాండ్లపెంటకు హంద్రీనీవా నీరు అందుతుందని అన్నారు. జగన్‌కు అజెండా ఏమీ లేక ఫీజు పోరు కార్యక్రమాన్ని చేపట్టారని విమర్శించారు. సమావేశంలో టీడీపీ రూరల్ మండల కన్వీనర్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

అడ్డగోలు ఆదేశాలు..!

● టీబీ వ్యాక్సిన్ ఏఎన్ఎంలే తెచ్చుకోవాలి... వైద్యాధికారుల హుకుం

● లేదంటే మెమోలు జారీ చేస్తామని బెదిరింపులు

కొత్తచెరువు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైద్య శాఖలో వింత పోకడ ఇది. సాధారణంగా క్షయవ్యాధి పీడితులకు ప్రభుత్వం టీబీ వ్యాక్సిన్ సరఫరా చేస్తుంది. అది పుట్టపర్తిలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి సరఫరా అవుతుంది. ఆ వ్యాక్సిన్‌ను ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు క్యారీ బ్యాగుల్లో సంబంధిత ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. జిల్లాలో ఆయా వైద్యాధికారులు వింత ఆదేశాలు ఇస్తున్నారు. టీబీ వ్యాక్సిన్‌ను ఏఎన్ఎంలే తెచ్చుకోవాలని హుకుం జారీ చేస్తున్నారట. తెచ్చుకోకపోతే మెమోలు జారీ చేస్తామని ఏఎన్ఎంలను బెదిరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఏఎన్ఎంలు.. ఎంఎస్ఎంఈ, వర్క్ ఫ్రం హోం, ఎన్‌సీడీ-సీడీ, ఆభకార్డుల జనరేషన్, పీ-4 సర్వే, సిటిజన్ రెసిడెన్స్ వంటి ఆరు సర్వేలను క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నారు వాటిని పూర్తి చేయకపోతే పనితీరు సరిగా లేదంటూ ఇటీవల కొందరు మెడికల్ ఆఫీసర్లు జిల్లాలో పలుచోట్ల ఏఎన్ఎంలకు మెమోలు జారీ చేసినట్లు తెలుస్తోంది. వ్యాక్సిన్ ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు తీసుకెళ్లాల్సి ఉండగా.. వైద్యులు మాత్రం వారిని పక్కనపెట్టి ఏఎన్ఎంలకే పనులు చెబుతుండటంతో వారికి తిప్పలు తప్పడంలేదు. ఈ విషయంపై జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ తిప్పయ్యను వివరణ కోరగా.. వ్యాక్సిన్‌ను సంబంధిత ఫార్మసిస్టులుగానీ, ల్యాబ్ టెక్నీషియన్లుగానీ తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. వారులేని పక్షంలో ఏఎన్ఎంలు తీసుకెళ్లాలన్నారు.



జిల్లా వైద్యాధికారి కార్యాలయం వద్ద టీబీ వ్యాక్సిన్ తీసుకెళ్తున్న ఏఎన్ఎంలు

గ్రానైట్‌కు గడ్డుకాలం

80% ఫ్యాక్టరీల మూత

- స్వస్థలాలకు వెళ్లిపోయిన కార్మికులు
- వైసీపీ హయాంలో పెరిగిన రాయల్టీ, విద్యుత్ చార్జీలు
- కూటమి ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి
- మూతపడ్డ పరిశ్రమల్లో గొర్రెల పెంపకం, కట్టెల డిపోలు

గ్రానైట్ పరిశ్రమకు రాష్ట్రంలోనే చీమకుర్తి తర్వాత ప్రసిద్ధిగాంచినది తాడిపత్రి. దశాబ్దాలుగా గ్రానైట్, నల్లబండల ఫ్యాక్టరీలతో కళకళలాడిన ఈ ప్రాంతం వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వెలవెలబోయింది. ఏకంగా 80 శాతం పరిశ్రమలు మూతపడ్డాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలాది మంది కార్మికులు ఉపాధి కోసం ఇక్కడికి వలస వచ్చారు. నేడు ఇక్కడి కార్మికులే ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్న దయనీయ పరిస్థితులు దాపురించాయి.


మూతపడ్డ గ్రానైట్ పరిశ్రమ


మిషన్లను తీసివేయడంతో ఖాళీగా గ్రానైట్ పరిశ్రమ

తాడిపత్రి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఎందరికో ఉపాధి కల్పించిన గ్రానైట్ పరిశ్రమ నేడు కుదేలయింది. తాడిపత్రి పరిసరాల చుట్టూ గ్రానైట్, కడపస్లాబ్ ఫ్యాక్టరీలు విస్తారంగా వ్యాపించి ఉన్నాయి. వీటిలో వివిధ స్థాయిలో పనులు చేసుకుంటూ వేలాదిమంది ఉపాధి పొందేవారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రానైట్ పరిశ్రమ బాగానే ఉంది. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఏడాదికేడాది విద్యుత్ చార్జీలు, రాయల్టీ, మైనింగ్ కంపెనీలను ప్రైవేట్ పరం చేయడం తదితర కారణాలతో పరిశ్రమలు కుదలేయ్యాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా అదే పద్ధతినే కొనసాగిస్తుండడంతో పరిశ్రమ యజమానులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో రాయల్టీలు పెరగడం, విద్యుత్ భారంతో పరిశ్రమలు దివాలా తీశాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అదే పద్ధతిలోనే కొనసాగుతడడంతో గ్రానైట్ పరిశ్రమల యజమానులకు మింగుడుపడడం లేదు.

80 శాతం మూత

తాడిపత్రి ప్రాంతంలో గతంలో దాదాపు గ్రానైట్ ఫ్యాక్టరీలు 650, కడపస్లాబ్ ఫ్యాక్టరీలు 1800 ఉండేవి. ప్రస్తుతం గ్రానైట్ ఫ్యాక్టరీలు 100, కడపస్లాబ్ ఫ్యాక్టరీలు 450 మాత్రమే ఉన్నాయి. నానాటికి పన్నుల పోటుతో ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయి. గతంలో విద్యుత్ చార్జీలు, రాయల్టీలు తక్కువగా ఉండేవి. వైసీపీ ప్రభుత్వంలో పన్నులు రెట్టింపు కావడంతో 80 శాతం మేర పరిశ్రమలు మూతబడ్డాయి. కరెంట్ బిల్లులు కట్టలేక చాలామంది నిర్వాహకులు గ్రానైట్, నల్ల బండల ఫ్యాక్టరీలను అమ్ముకున్నారు. గతంలో రాయల్టీ మీటరుకు రూ.2,500 ఉండగా.. ప్రస్తుతం రూ.5,600 ఉంది. వీటికి తోడు మైనింగ్ అధికారులు చెక్‌పోస్టులు పెట్టడంతో నిర్వహణ కష్టంగా మారింది. వీటిలో ఒక్కొక్క లారీకి రూ.9వేల నుంచి రూ.15వేల చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ముడిసరుకు రవాణా చేయాలంటే టన్నుకు రూ.800 ఉండేది. ప్రస్తుతం రూ.1300కు పెరిగింది. గతంలో ఒక పరిశ్రమకు విద్యుత్ బిల్లు నెలకు రూ.80వేల వరకు వచ్చేది. ఇప్పుడు లక్షన్నర వరకు బిల్లులు వస్తుండడంతో ఆదాయం లేక బిల్లులు కట్టలేక పరిశ్రమల యజమానులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

రెండు ఫ్యాక్టరీలను మూసేశా

గతంలో నాలుగు ఫ్యాక్టరీలను నిర్వహించేవాడిని. ప్రస్తుతం పన్నులు, విద్యుత్‌బిల్లుల భారంతో రెండు ఫ్యాక్టరీలను మూసివేసి రెండింటిని మాత్రమే నిర్వహిస్తున్నాను. రెండేళ్ల క్రితం పన్నులపోటు వల్ల సుమారు రూ.10లక్షల వరకు అప్పులు కావడంతో రెండు పరిశ్రమలను మూసివేయాల్సి వచ్చింది. పన్నులు ఇలాగే కొనసాగితే మిగతా రెండు కూడా మూసివేయాల్సి వస్తుంది. ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయం తీసుకుంటే పరిశ్రమల మనుగడ కొనసాగుతుంది.



-నబీరసూల్, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని


గొర్రెల షెడ్డుగా మారిన మూసివేసిన పరిశ్రమ

గొర్రెల షెడ్లుగా పరిశ్రమలు

పన్నులపోటు భరించలేక గ్రానైట్, కడపస్లాబ్ ఫ్యాక్టరీలను కొందరు యజమానులు గొర్రెల షెడ్లుగా లీజుకు ఇస్తున్నారు. మరి కొందరు చెక్కకోత మిషన్లకు, డిపోలకు బాడుగకు ఇస్తున్నారు. మూతపడ్డ పరిశ్రమల్లోని మిషనరీని గుజిరీకి వేసిన సందర్భాలు ఉన్నాయి. అప్పులు పెరిగిపోవడంతో ఫ్యాక్టరీలను అమ్ముకుంటున్నారు. మరికొన్నిచోట్ల ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఫ్యాక్టరీలను పడగొట్టి ప్లాట్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఫ్యాక్టరీలు మూతపడడంతో చాలామంది కార్మికులు రోడ్డునపడుతున్నారు. ఉపాధి దొరకక ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు.

వైసీపీ హయాంలో పన్నుల పోటు



2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పన్నుల భారం ఎక్కువయింది. ఏడాదికేడాది ముడిసరుకుల ధరలు పెరగడం, విద్యుత్ చార్జీలు పెరగడంతో నిర్వహణ కష్టమయింది. వ్యాపారాలు లేక, బిల్లులు చెల్లించలేక చాలామంది ఫ్యాక్టరీలను మూసివేశారు. పన్నుల భారంతోపాటు ప్రైవేట్ చెక్‌పోస్టులు ఎక్కువయ్యాయి. కొత్త ప్రభుత్వంలోనైనా పన్నుల భారం తగ్గించి మాకు న్యాయం చేయాలి.

-శంకర్‌నాయుడు, నల్లబండల ఫ్యాక్టరీ యజమాని

సొంత రాష్ట్రాలకు వెళ్లిన కార్మికులు

తాడిపత్రి ప్రాంతంలోని పరిశ్రమల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఎక్కువగా ఉన్నారు. వేలాది మంది కార్మికులు బీహార్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, అస్సాం, ఒడిషా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి వచ్చారు. ఏళ్ల క్రితం వచ్చి ఇక్కడే జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఫ్యాక్టరీలు మూతపడుతుండడంతో ఉపాధి లేక సొంత రాష్ట్రాలకు తిరిగి వెళుతున్నారు. యజమానులు చేసేదిలేక కూలీలను వెనక్కి పంపిస్తున్నారు.

కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు



గ్రానైట్, కడపస్లాబ్ పరిశ్రమలు మూసివేస్తుండడంతో మా కుటుంబసభ్యులు చాలా మంది సొంత ఊరికి వెళ్లారు. నేను ఒక్కడినే ఇక్కడ ఉంటూ బండలపాలిష్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నా. ఈ పని కూడా ఎన్నాళ్లు ఉంటుందో తెలియకుండా ఉంది. సొంత ఊళ్లో పనులు లేక ఇక్కడికి వస్తే ఇక్కడ కూడా ఇదే పరిస్థితులు నెలకొన్నాయి.

- శ్రీరాములునాయక్, వలసకూలీ, కళ్యాణదుర్గం

మేనమామ మోసం...!

పేద విద్యార్థినులకు శాపం

- టీడీపీ హయాంలో ఎంజేపీ నిర్మాణం ప్రారంభం
- సగం మేర పనులు పూర్తి
- వైసీపీ పాలనలో అటకెక్కిన వైనం
- పైసా కూడా బిల్లులు చెల్లించని దుస్థితి
- రేకుల షెడ్డులో బాలికల అవస్థలు


మొండిగోడలతో ఎంజేపీ పాఠశాల భవనం


గుమ్మఘట్టలో రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల

గుమ్మఘట్ట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు తాను మేనమామనని ప్రకటించుకున్న మాజీ సీఎం జగన్.. క్షేత్రస్థాయిలో వారికి తీవ్ర అన్యాయం చేశారు. అత్యంత వెనుకబడిన రాయదుర్గం ప్రాంతంలో బాలికా విద్యను పెంపొందించేందుకు టీడీపీ హయాంలో మండలంలోని గోనబావి గ్రామం వద్ద మహాత్మ జ్యోతిరావ్ పూలే బాలికల (ఎంజేపీ) గురుకుల విద్యాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిధులు మంజూరు చేశారు. పనులు సగం వరకు పూర్తి చేశారు. ఈ ప్రాంత విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఎంతో సంతోషపడ్డారు. ఇంతలోనే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి అయిన జగన్.. విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తున్నామంటూ గొప్పలు చెప్పారు. బాలికా విద్య కోసం నిర్మిస్తున్న ఎంజేపీ విద్యాలయంపై నిర్లక్ష్యం చూపారు. పైసా కూడా నిధులివ్వలేదు. దీంతో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. జగన్ పుణ్యమాని ఏడేళ్లుగా తాత్కాలిక రేకుల షెడ్లలో విద్యార్థినులు అవస్థలు పడుతూ చదువుకుంటున్నారు. కనీస వసతులేక తిప్పలు పడుతున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో పాఠశాల భవనాల పనులు మొదలు పెట్టేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత.. ఇటీవల అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వెంటనే పనులు మొదలెట్టేలా చర్యలు చేపడుతున్నారు. సాంకేతిక సమస్యల కారణంగా పనులు జాప్యమవుతున్నట్లు తెలుస్తోంది. వీటిని పరిష్కరించి, వెంటనే భవన నిర్మాణాలు పూర్తి చేసి, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికైనా అందుబాటులోకి తేవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైసీపీ పాపం..

రాయదుర్గం వెనుకబడిన ప్రాంతం. చాలామంది వలసలు వెళ్తారు. పేదరికం తదితర కారణాలతో చాలామంది పిల్లలు చదువుకు దూరమౌతున్నారు. టీడీపీ ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అప్పట్లో మంత్రిగా పనిచేసిన కాలవ శ్రీనివాసులు ఈ ప్రాంతంలో బాలికా విద్యను ప్రోత్సహించేందుకు గురుకుల పాఠశాల అవసరమని భావించారు. పాఠశాల నిర్మాణానికి ఉపక్రమించారు. గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామ సమీపాన రూ.24 కోట్లతో 2016లో విద్యాలయ భవనాల నిర్మాణం చేపట్టారు. రెండేళ్లపాటు రూ.12 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో పనులకు గ్రహణం పట్టింది. పైసా కూడా బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా ఆపేశారు. అప్పట్నుంచి ఏడేళ్లుగా ఆ భవనాలు దిష్టిబొమ్మలా కనిపిస్తున్నాయి. విద్యాలయాన్ని తాత్కాలికంగా గుమ్మఘట్టలోని సొసైటీ షెడ్లలో నిర్వహిస్తున్నారు. ఐదు నుంచి పదో తరగతి వరకు 400 మంది దాకా విద్యార్థినులు చదువుకుంటున్నారు. తాత్కాలిక షెడ్లలో కనీస వసతుల్లేక విద్యార్థినులు ఏడేళ్లుగా నరక యాతన అనుభవిస్తున్నారు.

నిధులు పెంచి..

గతేడాది కూటమి అధికారంలోకి రావడంతో ఎంజేపీ విద్యాలయ నిర్మాణంపై ఆశలు రేగాయి. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇటీవల అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. మరో రూ.8 కోట్ల మేర నిధులు పెంచి, పనులు ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆ మేరకు నిధులు మంజూరు చేశారు. పనులు మొదలవాల్సి ఉంది. మూడునెలలుగా పనులు ముందుకు కదలడం లేదు. విద్యా సంవత్సరం దగ్గర పడుతుండడంతో విద్యార్థినుల తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. పాఠశాల పునఃప్రారంభం నాటికి పనులు మొదలవుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్ల ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. వాటిని పరిష్కరించి, వెంటనే పనులు మొదలయ్యేలా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలి

వచ్చే విద్యా సంవత్సరం నాటికైనా పాఠశాల భవనాలు పూర్తి చేయాలి. మూడునెలల క్రితం మంత్రి సవిత హామీ ఇచ్చి వెళ్లారు. అధికారులు పనులు ప్రారంభించడంలో జాప్యం చేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. వెంటనే పనులు ప్రారంభించాలి.



- రవి, విద్యార్థిని తండ్రి, గోనబావి

పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం

గతంలో గురుకుల భవన నిర్మాణ టెండర్ దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టు సంస్థకు పనులు ప్రారంభించాలని నోటీసులు జారీ చేశాం. సంబంధిత కాంట్రాక్టు సంస్థ నుంచి సమాధానం రాలేదు. ఆ సంస్థ ప్రారంభించకపోతే ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం.

-శివకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

'మొల్లమాంబ జయంతిని విజయవంతం చేయండి'

అనంతపురం ప్రెస్ క్లబ్, మార్చి11(ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు మహిళా కవయిత్రి, రామాయణ రచయిత మొల్లమాంబ జయంతిని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారీ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 13వతేదీన ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవన్‌లో మొల్లమాంబ జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నాయకులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

సేంద్రియ చైతన్యం

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

రెండు వేల హెక్టార్లకు పైబడి సాగు

కళ్యాణదుర్గం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పంట పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. సేంద్రియ సాగుకు మొగ్గు చూపుతున్నారు. పొలాలకు పేడ ఎరువులు వేస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది. రసాయన ఎరువులకు స్వస్తి పలుకుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా సేంద్రియ ఎరువులను ఉపయోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో తలెత్తుతున్న అనర్థాలపై రైతుల్లో చైతన్యం వచ్చింది. భూసారాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. పశువుల పేడ, మేక, గొర్రెల ఎరువులను పొలాలకు తోలుతున్నారు. పశువులు లేని రైతులు పేడ ఎరువు కొనుగోలు చేసి మరీ.. పొలాల్లో వేసుకుంటున్నారు.


చేనులో తోలిన పేడ ఎరువు

సేంద్రియ ఎరువులతో మంచి దిగుబడులు



కర్బూజా, కళింగర పంటల సాగుకు సేంద్రియ ఎరువులు ఉపయోగిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ఈ పంటలకు ఎటువంటి తెగుళ్లు సోకకుండా సేంద్రియ ఎరువులు బాగా ఉపయోగపడతాయి. పేడ ఎరువుకు మంచి డిమాండ్ ఉంది. పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో సేంద్రియ ఎరువు ఆయా ప్రాంతాల్లో మంచి రేటు పలుకుతోంది.

- హరీష్, రైతు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

ఖరీఫ్ కింద ఏటా నియోజకవర్గ వ్యాప్తంగా రెండు వేల హెక్టార్లకు పైబడి వేరుశనగ సాగు చేస్తున్నారు. అంతర పంటలు కూడా వేసుకుంటారు. పంటలకు సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. కర్బూజా, కళింగర, టమోటా, బొప్పాయి, మిర్చి, బీర పంటలకు కూడా సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తున్నారు. తద్వారా పెట్టుబడులు తగ్గడమే కాకుండా పంట దిగుబడులు ఆశాజనకంగా వస్తాయని రైతులు అంటున్నారు. కొనుగోలు చేసిన సేంద్రియ ఎరువును రైతులు.. ఎండ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా తోలుకునే పనిలో నిమగ్నమయ్యారు. రసాయన ఎరువుల ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. వాటి కోసం రైతులు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వెరసి పెట్టుబడి పెరిగిపోతోంది. రసాయన ఎరువుల వాడకం వల్ల పంటలకు చీడపీడలు సోకి పంట దిగుబడి తగ్గిపోతోంది. దీంతో రసాయన ఎరువుల వినియోగానికి రైతులు వెనకడుగు వేస్తున్నారు.

రసాయన ఎరువులకు స్వస్తి

పంటలకు పేడ ఎరువుల వినియోగం

తగ్గనున్న ఖర్చు



రసాయన ఎరువుల వాడకం కారణంగా భూమి గట్టిపడుతోంది. పంటలకు తెగులు అధికంగా సోకుతున్నాయి. పశువుల పేడ వాడకంతో భూమి గుళ్ల బారి ఎక్కువ కాలం సత్తువ ఉంటోంది. రోగాలు కూడా తక్కువే. దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయి. దీంతో ఏటా పశువుల ఎరువునే వాడుతా.

- రామాంజనేయులు, రైతు, కరిగానిపల్లి

లాభాలు అనేకం..

సేంద్రియ ఎరువు వాడకం ద్వారా రైతుకు అనేక లాభాలు చేకూరుతాయి. పశువుల పేడ చెత్తతో కూడిన సేంద్రియ ఎరువు వేస్తే పొలాల్లో ఎక్కువ కాలం భూమిలో తేమ ఉంటుంది. దీంతో చీడపురుగులు నశిస్తాయి. తెగుళ్లు కూడా తక్కువే. రైతుకు ఖర్చు తగ్గి, అధిక ఫలసాయం లభిస్తుంది.

- ఎల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం డివిజన్

డ్వామాలో బదిలీల ఫీవర్



- ఉమ్మడి జిల్లా యూనిట్‌గా నిర్వహణకు కసరత్తు
- తాజాగా ఏపీడీల బదిలీలతో మొదలైన చిచ్చు
- చక్రం తిప్పుతున్న హెచ్‌ఆర్ విభాగ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): డ్వామాకు బదిలీల ఫీవర్ పట్టుకుంది. గత ఏడాది సెప్టెంబరులో ఉద్యోగుల బదిలీలు చేపట్టినా.. డ్వామా నుంచి ఎవ్వరినీ కదిలించలేదు. ప్రభుత్వం అనుమతివ్వలేదు. దీంతో డ్వామాలో ఉద్యోగుల బదిలీలు త్వరలో ఉండొచ్చని తాజా సమాచారం. ఈ నేపథ్యంలో ఇటీవల ఇద్దరు ఏపీడీల బదిలీతో ఉద్యోగుల్లో చిచ్చు మొదలైంది. ఉమ్మడి జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, గుత్తి, తాడిపత్రి, కదిరి, హిందూపురం, ధర్మవరం, మడకశిర, ఓడీసీ, పుట్టపర్తి క్లస్టర్లున్నాయి. తాజాగా గుత్తి, తాడిపత్రి ఏపీడీలను బదిలీ చేయడం పట్ల డ్వామా ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు ఆరు క్లస్టర్లకు ఏపీఓలు.. ఇన్‌చార్జి ఏపీడీలుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోనే ఏళ్లుగా పనిచేస్తున్న ఏపీడీలను కోరుకున్న స్థానానికి బదిలీ చేయడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో డ్వామాలో ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీలు చేపట్టేందుకు సీఆర్‌డీ నుంచి సూచనప్రాయంగా అనుమతి లభించినట్లు సమాచారం. త్వరలో ఉద్యోగుల బదిలీలు చేపట్టే అవకాశం ఉంది. బదిలీల్లో కీలకంగా ఉన్న హెచ్‌ఆర్ విభాగంలో గత వైసీపీ ప్రభుత్వంలో హవా సాగించిన ఉద్యోగులే ఉండడం గమనార్హం. గత వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు ఉన్న హెచ్‌ఆర్ విభాగ ఉద్యోగులు బదిలీల్లో తమకు అనుకూలంగా ఉండే వారికే ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముందుగా హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కల్పించి, తరువాత బదిలీలు చేపట్టాలని డ్వామా ఉద్యోగులు కోరుతున్నారు. డ్వామాలో వాటర్‌షెడ్ ఏపీడీ కూడా ఏడేళ్లుగా ఒకే స్థానంలో కొనసాగుతున్నారు. వాటర్‌షెడ్ పీఓలను కూడా బదిలీ చేస్తారా.. వారినే కొనసాగిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది.



డ్వామా కార్యాలయం

చక్రం తిప్పుతున్న హెచ్‌ఆర్ విభాగం

డ్వామాలో బదిలీలకు సంబంధించి ఉమ్మడి జిల్లా యూనిట్‌గా చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో హెచ్‌ఆర్ విభాగమే కీలకం. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా 63 మండలాల్లో పనిచేస్తున్న ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీలు చేపట్టనున్నారు. ఏడేళ్లుగా హెచ్‌ఆర్‌లో పాతుకుపోయిన ఉద్యోగులే బదిలీలు చేపడుతుండడంతో అర్హులకు అన్యాయం వాటిల్లే అవకాశం ఉందన్న ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది. మొదట హెచ్‌ఆర్ విభాగంలో పనిచేసే వారికి స్థానచలనం కల్పించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్, డ్వామా పీడీల వద్ద చర్చకు వచ్చినట్లు సమాచారం.

బదిలీలు ఉండొచ్చు..

ఉద్యోగుల బదిలీలు ఉండొచ్చని సీఆర్‌డీ ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఏపీఓ, టీఏ, ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీలు చేపట్టాలని నిబంధన ఉంది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి పూర్తిస్థాయిలో నియమ, నిబంధనలు రావాల్సి ఉంది. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న వారికి కచ్చితంగా స్థానచలనం ఉంటుంది. బదిలీల్లో ఏ ఒక్క ఉద్యోగికి అన్యాయం వాటిల్లకుండా చూస్తాం. సీనియార్టీ ప్రకారం ఉద్యోగుల వివరాలను సిద్ధం చేయాలని సూచించాం.

-సలీంబాషా, డ్వామా పీడీ

డ్యాన్స్ చేస్తూ యువకుడి మృతి


ముస్తాఫా (ఫైల్)

యాడికి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సరదాగా డ్యాన్స్ చేస్తూ ఉన్నట్లుండి ముస్తాఫా (18) అనే యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి యాడికిలో జరిగింది. యాడికిలోని పిన్నేపల్లిరోడ్డు లేఔట్‌లో నివాసం ఉంటున్న మహబ్బీ, దస్తగిరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దస్తగిరి నాలుగేళ్లక్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. పెద్ద కుమార్తె రేష్మాకు వివాహం చేశారు. చిన్న కుమార్తె రజియా దివ్యాంగురాలు. కుమారుడు ముస్తాఫా చేనేత కార్మికుడిగా పని చేస్తున్నాడు. తల్లి మహబ్బీ కూలీ పనులకు వెళుతోంది. యాడికిలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో సోమవారం రాత్రి ముస్తాఫా స్నేహితులతో కలిసి స్వామి వాహనసేవ ముందు డ్యాన్స్‌వేస్తూ ఉన్నట్లుండి కుప్పకూలాడు. చికిత్స నిమిత్తం స్నేహితులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ముస్తాఫా మృతి చెందినట్లు తెలిపారు.

మత్తుపదార్థాలు తీసుకోవడమే కారణమా..?

ముస్తాఫా సోమవారం రాత్రి కల్లులోకి కొన్ని మత్తుపదార్థాల్ని కలిపి సేవించినట్లు అతడి స్నేహితులు తెలిపారు. ఆ పదార్థాలను తీసుకోవడం వల్లే మృతి చెందినట్లు తెలుస్తోంది. యాడికిలోని కల్లు దుకాణాలన్నింటిలో యువకులు మత్తుపదార్థాల్ని వేయించుకొని తాగుతున్నారని చర్చించుకుంటున్నారు. కల్లు దుకాణాల్లో మత్తుపదార్థాలు వాడకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పగలే ఇంట్లో చోరీ

నాలుగు కేజీల వెండి అపహరణ


చెల్లాచెదురుగా పడిన బీరువాలోని వస్తువులు

నార్పల, మార్చి11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో మంగళవారం బంగారు దుకాణం యజమాని ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వెంకటేశు అనారోగ్యానికి గురి కావడంతో ఇంటికి తాళం వేసి తన భార్యతో అనంతపురంలోని ఓ ఆసుపత్రికి చికిత్సనిమిత్తం వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని దుండుగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాలో ఉన్న నాలుగు కేజీల వెండిని అపహరించుకొని వెళ్లారు. హాస్పిటల్ నుంచి తిరిగి వచ్చిన వెంకటేశు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సాగర్ సంఘటన స్థలాన్ని డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలన చేపట్టారు. అదేవిధంగా నార్పలకు చెందిన వేణు సిమెంట్ దుకాణంలో 300 ప్యాకెట్ల సిమెంటును చోరీ చేశారు. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య


భర్తతో అఖిల (ఫైల్)

ధర్మవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేసేపేటలో లక్ష్మీపతి భార్య నీరుగంటి అఖిల(22) మంగళవారం మధ్యాహ్నం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మీపతి, అఖిలకు రెండు సంవత్సరాలక్రితం వివాహమైంది. అఖిల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుండేది. వీరికి సంతానం లేదు. పెళ్లైన కొన్ని నెలలు వీరి కాపురం సాఫీగా సాగింది. ఆ తరువాత ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన అఖిల మంగళవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలు అడిగితెలుసుకున్నారు. మృతిరాలి తల్లి కళావతి తన కుమార్తె మృతికి అల్లుడు, వారి కుటుంబసభ్యులే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 20,720 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 11వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

నేటి నుంచి సూపర్ స్పెషాలిటీలో పీడియాట్రిక్ సేవలు

అనంతపురం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో పిడియాట్రిక్ సర్జన్‌సేవలు అందనున్నాయని సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు మంగళవారం వెల్లడించారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఇక నుంచి వారానికి రెండురోజులపాటు ఓపీసేవలు కొనసాగుతాయన్నారు. ప్రతి సోమ, బుధవారాల్లో సేవలందుతాయన్నారు. నేటి నుంచి సేవలు అందించడం జరుగుతుందన్నారు.

జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శిగా భీమలింగారెడ్డి



భీమ లింగారెడ్డి, మురళీ కృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శిగా భీమలింగారెడ్డి నియమితులయ్యారు. సోమవారం అనంత క్రీడాగ్రామంలో నిర్వహించిన జిల్లా క్రికెట్ సంఘం సర్వసభ్య సమావేశంలో జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శులను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. భీమలింగారెడ్డిని కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా జిల్లా మాజీ క్రీడాకారుడు మురళీకృష్ణను ఎన్నుకున్నారు. ఈ ఏడాది నవంబరు వరకు ఇద్దరు ఆయా పదవుల్లో కొనసాగనున్నారు.

ప్లాట్‌ఫాం ఏడుపు..!

దెబ్బతిన్న 7వ నంబరు ప్లాట్‌ఫాం యాప్రాన్

- తరచూ విరిగిపోతున్న రైలు పట్టాలు
- రైళ్లన్నీ వేరే ప్లాట్‌ఫాంల్లోకి మళ్లింపు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


7వ నంబరు ప్లాట్‌ఫాంలో ట్రాక్ యాప్రాన్ దెబ్బతిని వదులైపోయిన స్లీపర్లు


తెగిన రైలు పట్టాను తొలగించి మరమ్మతులు చేస్తున్న గ్యాంగ్ సిబ్బంది


ట్రాక్ యాప్రాన్ పాడైపోయిన 7వ నంబరు ప్లాట్‌ఫారం

గుంతకల్లు, మార్చి11(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో ఓ ప్లాట్‌ఫాం దెబ్బతినడంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. రైల్వే స్టేషన్‌లోని 7వ నంబరు ప్లాట్‌ఫాంకు ఉన్న ట్రాక్ యాప్రాన్ దెబ్బ తినడంతో రైల్వే అధికారులు ఆ లైన్‌ను తక్కువగా వినియోగిస్తున్నారు. ఎప్పుడూ అత్యంత రద్దీగా ఉండే ఈ ప్లాట్‌ఫాంను రైల్వే అధికారులు వినియోగించడం తగ్గించేశారు. ఈ ప్లాట్‌ఫాంలోకి వచ్చే ప్రధాన రైళ్లన్నింటినీ సరైన వసతుల్లేని 5వ నంబరు ప్లాట్‌ఫాంలోకి పంపుతున్నారు. ఈ కారణంగా ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. 7వ నం. ప్లాట్‌ఫాంలో యాప్రాన్ ధ్వంసమైపోయిన కారణంగా రైళ్లు వచ్చినప్పుడు ట్రాక్ కిందకు కుంగిపోతోంది. దీని వల్ల ట్రాక్ పట్టాలు తరచుగా విరిగి ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో ఆ ప్లాట్‌ఫాం వినియోగాన్ని తగ్గించేశారు.

ధ్వంసమైన యాప్రాన్

ప్లాట్‌ఫాంలలో ట్రాక్‌పైన పారిశుధ్య సమస్య ఏర్పడకుండా గతంలో కమ్మీలకు బేలస్ట్ (కంకరను) వేయకుండా సిమెంటు కాంక్రీటు (యాప్రాన్)ను వేసేవారు. అలా సిమెంట్ యాప్రాన్ వేయడం వల్ల రైలు ప్లాట్‌ఫాంపై ఉన్నప్పుడు ప్రయాణికులు రైళ్లల్లోని టాయిలెట్లను ఉపయోగిస్తే పారిశుధ్య పనులు చేయడానికి సులభంగా ఉంటుంది. కానీ గడచిన ఏడేళ్ల కాలంలో బోగీలన్నింటిలోనూ గ్రీన్ టాయిలెట్లను అమర్చడంతో స్టేషన్లలో అపరిశుభ్రత తగ్గింది. గ్రీన్ టాయిలెట్ల కారణంగా యాప్రాన్ల నిర్మాణ కార్యక్రమానికి రైల్వే ఫుల్‌స్టాప్ పెట్టింది. ఈ నేపథ్యంలో గతంలో ప్లాట్‌ఫాంల ట్రాక్‌కు వేసిన సిమెంటు యాప్రాన్ నిర్మాణాలను సరిగా నిర్వహించని కారణంగా దెబ్బతింటున్నాయి. ఈ మేరకు ఇతర ప్లాట్‌ఫాంలతో పోలిస్తే 7వ నంబరు ప్లాట్‌ఫాంలో వేసిన యాప్రాన్ ఎక్కువగా దెబ్బతింది. దీని వల్ల సిమెంటు వదులైపోయి రైళ్ల బరువుకు అందులోని స్లీపర్లు కిందకు కుంగుతున్నాయి. ట్రాక్ కమ్మీలపై ఒత్తిడి పెరిగి విరిగిపోతున్నాయి. దీని వల్ల 7వ నంబరు ప్లాట్‌ఫాం పట్టాలను తరచుగా మరమ్మతు చేయాల్సి వస్తోంది.

వసతుల్లేని ప్లాట్‌ఫాంతో ఇబ్బందులు

దశాబ్దాలుగా గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో 7వ నంబరు ప్లాట్‌ఫారానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ప్రధాన రైళ్లన్నింటినీ 7వ నంబరు ప్లాట్‌ఫాంలోకి తెచ్చేవారు. దీని వల్ల అక్కడ ప్రయాణికుల వేచి ఉండే గదులు, ఆహారపు స్టాళ్లు, హోటళ్లు, జీఆర్పీ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేశారు. దీంతో రైళ్లు 7వ ప్లాట్‌ఫాంలోకి వస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. కానీ ప్రస్తుతం రైళ్లను 7కు బదులు 5వ ప్లాట్‌ఫాంలోకి తెస్తున్నారు. 5వ నంబరు ప్లాట్‌ఫాంలో కేవలం రెండు స్టాళ్లు మాత్రమే ఉన్నాయి. తక్కువసేపు స్టాపింగ్ ఉండే రైళ్లల్లోని ప్రయాణికులు ఆహార పదార్థాలను కొనడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. అలాగే ప్రయాణికులు జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో ఏదైనా ఫిర్యాదు ఇవ్వదలిస్తే ప్లాట్‌ఫాం దాటి 7వ ప్లాట్‌ఫాంపైకి రావాల్సి ఉంటుంది. దీనికి తోడు 6వ నంబరు ప్లాట్‌ఫాంపై రాయచూరు, కాచిగూడ ప్యాసింజరు రైళ్లను మాత్రమే నిలుపుతున్నారు. 6వ ప్లాట్‌ఫాంపైకి గతంలో వచ్చే రైళ్లను 4వ నంబరులోకి తీసుకెళ్తున్నారు. ఇక్కడ కూడా ప్రయాణికులకు సమస్యలే ఎదురవుతున్నాయి. రైళ్ల కోసం ఎదురు చేసే ప్రయాణికులకు 4-5 ప్లాట్‌ఫాంలలో వెయిటింగ్ హాళ్లు లేకపోవడం సమస్యగా మారింది. ఇదిలా ఉండగా 7వ ప్లాట్‌ఫాంలో పదుల సంఖ్యలో ఏర్పాటైన స్టాల్స్, హోటళ్ల నిర్వాహకులు వ్యాపారాలు కరువయ్యాయని వాపోతున్నారు. 7వ నంబరు ప్లాట్‌ఫాంపై ధ్వంసమైన యాప్రాన్‌కు మరమ్మతులు చేసి రైళ్లను 6-7 ప్లాట్‌ఫాంల్లోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు విద్యార్థినులు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. కురుగుంట కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న రుచిత బుద్ధిగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించినందుకు ఉరి వేసుకుంది. సోమందేపల్లిలోని కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న పూజశ్రీ తన చావుకు ఎవరూ కారణంకాదని లేఖ రాసి ఆత్మహత్య చేసుకుంది. దీంతో బాధిత కుటుంబాలలో విషాదం అలుముకుంది.

చదువుకోవాలని మందలించినందుకు...


రుచిత మృతదేహం

అనంతపురం క్రైం/రూరల్/సోమందేపల్లి మార్చి 11(ఆంధ్రజ్యోతి): బుద్ధిగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించినందుకు తొమ్మితో తరగతి విద్యార్థిని రుచిత(14) ఆత్మహత్య చేసుకుంది. అనంతపురం రూరల్ ఎస్‌ఐ రాంబాబు తెలిపిన వివరాల మేరకు, కురుగుంట వైఎస్సార్ కాలనీకి చెందిన రాజేష్, మునీశ్వరి దంపతుల కూతురు రుచిత కురుగంట కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తరగతులకు సరిగా వెళ్లేదికాదు. బాలిక తీరు కారణంగా ఇబ్బంది పడుతున్నామని కొందరు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గతంలోనే రెండుసార్లు బాలికను ఇంటికి పంపారు. తల్లిదండ్రులు సర్దిచెప్పి వదిలి వెళ్లాక మరోసారి సమస్య తలెత్తింది. దీంతో ఇంటికి తీసుకువెళ్లాలని మంగళవారం ప్రిన్సిపాల్ సూచించారు. తల్లి మునీశ్వరి మధ్యాహ్నం పాఠశాలకు వచ్చి రుచితను ఇంటికి తీసుకెళ్లారు. ఆ కుటుంబం సమీపంలోని రాధాస్వామి సత్సంగ్ ఆశ్రమంలో ఉంటోంది. రుచితను అక్కడికి తీసుకెళ్లి చెట్లకు నీరు పట్టమని పురమాయించారు. ఆ క్రమంలోనే మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో రుచిత ఓ లేఖ రాసి, చెట్టుకు ఉరి వేసుకుంది. తాను ఓ అమ్మాయితో స్నేహంగా ఉండటంలో తప్పేమిటని లేఖలో రాసినట్లు తెలిసింది. రూరల్ ఎస్‌ఐ రాంబాబు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థిని ఆత్మహత్య నేపథ్యంలో డీఈఓ ప్రసాద్‌బాబు, కేజీబీవీల ఏపీసీ శైలజ మంగళవారం రాత్రి కేజీబీవీని పరిశీలించారు. ఘటన గురించి విద్యార్థులు, ఉపాధ్యాయులను విచారించారు. వివరాలను నమోదు చేసుకుని వెళ్లారు.

ఎవరూ కారణం కాదు..

సోమందేపల్లిలో పదోతరగతి విద్యార్థిని పూజశ్రీ (15) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కస్తూర్బా పాఠశాలలో పదోతరగతి చదువుతున్న పూజశ్రీ ఐదు రోజుల క్రితం అనారోగ్యానికి గురైంది. ఎస్‌ఓ అనిత తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో తండ్రి సురేష్, తల్లి సుధామణి ఆ విద్యార్థినిని ఇంటికి తీసుకెళ్లారు. అయితే మంగళవారం ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. తన చావుకు ఎవరూ కారణంకాదని లేఖరాసి మృతి చెందినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వైసీపీ పాపం..!

శుద్ధి నీటి ప్లాంట్ మూత



నిరుపయోగంగా మారిన డాక్టర్ వాటర్ ప్లాంట్

కూడేరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాపం.. ప్రజలకు శాపంగా మారింది. ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన శుద్ధి నీటి ప్లాంట్ మూతపడింది. ఐటీసీ కంపెనీ 2011లో డాక్టర్ వాటర్ ప్లాంట్‌ను కూడేరులో ఏర్పాటు చేసింది. రూ.2కే బిందె నీరు ఇచ్చేవారు. ఐదేళ్ల తరువాత వాటర్ ప్లాంట్‌ను పంచాయతీకి అప్పగించారు. సక్రమంగా నిర్వహిస్తుండేవారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక ప్లాంట్ నిర్వహణ ఆ పార్టీ నాయకుల చేతుల్లోకి వెళ్లింది. దీంతో నిర్వహణ గాడితప్పింది. ప్లాంట్‌కు సంబంధించి కరెంటు బిల్లులు కూడా చెల్లించకపోవడంతో బంద్ చేశారు. దీంతో అధిక ధరలు వెచ్చించి ప్రైవేటు వాటర్ ప్లాంట్ల నుంచి శుద్ధి నీరు కొనుగోలు చేయాల్సి వస్తోందని పేద ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, తక్కువ ధరకే శుద్ధి నీటిని సరఫరా చేసే వాటర్ ప్లాంట్‌ను పునఃప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

మద్దతు ధరతో పప్పుశనగ కొనుగోలు

ఆర్‌ఎస్‌కేల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి

అనంతపురం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పప్పుశనగ ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందని ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పప్పుశనగ విక్రయించాలనుకునే రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. క్వింటా పప్పుశనగ రూ.5650లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులతో మాత్రమే పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 14 శాతంలోపు తేమ శాతం ఉండేలా చూసుకోవాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): గుత్తి మండలం గొల్లలదొడ్డి(సేవాఘడ్)లో ఉన్న గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 5,6,7,8,9 తరగతుల్లో ఖాళీల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలో 5వ తరగతికి 80 సీట్లు ఖాళీలున్నాయి. ఎస్టీ బ్యాక్‌లాగ్ కింద 6వ తరగతిలో 49 సీట్లు, 7వ తరగతిలో 30, 8వ తరగతిలో 19, 9వ తరగతిలో 06 సీట్లు ఖాళీలున్నాయన్నారు. ఈ సీట్ల భర్తీలో ఎస్టీలకు 78 శాతం, ఎస్సీలకు 12, బీసీలకు 5, ఓసీలకు 2, ఏఈక్యులకు 3 శాతం చొప్పున సీట్లను కేటాయించడం జరుగుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 25వ తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 6న గొల్లలదొడ్డి గిరిజన పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్‌ను 9885369079, 8978239363, 9550655840 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆలయ సొమ్ము చోరీ.. అంతర్రాష్ట్ర దొంగల పనే..

ఇద్దరి అరెస్టు... పరారీలో మరో నిందితుడు

రూ.10.05 లక్షల నగదు, బైక్ స్వాధీనం



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రమణమూర్తి

అనంతపురం క్రైం/కణేకల్లు, మార్చి11(ఆంధ్రజ్యోతి): కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామంలో వారంరోజుల క్రితం ఆలయ సొమ్ము చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఏఎస్పీ డీవీ రమణమూర్తి మంగళవారం వెల్లడించారు. సీతారామాంజనేయుల దేవాలయ నిర్మాణానికి గ్రామంలో చందాల రూపంలో డబ్బు పోగు చేశారు. ఇలా పోగైన డబ్బు రూ.12 లక్షలు గ్రామానికి చెందిన గుర్రం లక్ష్మన్న వద్ద ఉంచారు. ఈ నగదు ఇంట్లో ఉంచి తాళం వేసి, పనిపై లక్ష్మన్న మరో ఊరెళ్లాడు. అదును చూసి ఈనెల 3వ తేదీ అర్ధరాత్రి దాటాక ఇంటి తాళాలు పగులగొట్టి, దొంగలు లోపలికి చొరబడ్డారు. ఆలయ నిర్మాణానికి పోగు చేసిన మొత్తం రూ.12లక్షలు ఎత్తుకెళ్లారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కణేకల్లు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

అరెస్టయిన వారు వీరే..

అన్నమయ్య జిల్లా నందలూరు మండలం నల్లతమ్మాయిపల్లికి చెందిన గురునాథం రాజు అలియాస్ గురునాథం ఏడుకొండలు. ప్రస్తుతం ఇతడు కడప జిల్లా ఒంటిమిట్ట సిద్దవటం మండలం కొత్తమాధవరంలో నివాసముంటున్నాడు. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూర్ జిల్లా వానియంబాడి తాలూకా రాజపాలెంకు చెందిన దండిపాణి కార్తీక్‌ను అరెస్టు చేశారు. కడప జిల్లా ఒంటిమిట్ట సిద్దవటం మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన నాగలూరి జానయ్య పరారీలో ఉన్నాడు. వారి నుంచి రూ.10.05 లక్షల నగదు, చోరీకి ఉపయోగించిన పరికరాలు, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన సొమ్ములో మిగిలిన డబ్బు రూ.1.95 లక్షలు పరారీ నిందితుడు తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది.

చోరీ చేశారిలా..

గురునాథం రాజు, నాగలూరి జానయ్య సమీప బంధువులు. జానయ్య వరుసకు మేనమామ అవుతాడు. వీరి తల్లిదండ్రులు పాములు పట్టుకుని ఊరూరా తిరుగుతూ వాటిని ఆడిస్తూ జీవనం సాగించేవారు. గురునాథం రాజు తమిళనాడులో బాతులు మేపుతూ జీవనం చేసేవాడు. జానయ్య ఇటుకల బట్టీలో పనిచేసేవాడు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కార్తీక్.. గురునాథం రాజుకు బాతులు మేపే సందర్భంలో పరిచయమయ్యాడు. దీంతో ముగ్గురూ స్నేహితులుగా మారారు. ఈ క్రమంలో 20రోజుల నుంచి ముగ్గురూ మోటారు సైకిల్‌పై గ్రామాల్లో తిరుగుతూ ఊరు చివర డేరాలు వేసుకునేవారు. రెండు, మూడు రోజులుండి అక్కడ పాములు ఆడించుకుని ఊరు చివర్లో ఉన్న చిన్న గుడులు, బయట హుండీలను, అందులో డబ్బును అపహరించేవారు. ఆ తర్వాత ఆ ఊరిలో డేరాలు ఖాళీ చేసి, దూరంలో ఉండే మరో గ్రామానికి చేరుకుంటారు. ఈ క్రమంలో కర్ణాటక నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయర్‌కు దగ్గర్లో బైక్‌లో వస్తుండగా దారిలో సొల్లాపురం గ్రామంలో తాళం వేసిన ఇంటిని గమనించారు. చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. మరుసటిరోజు రాత్రి ముగ్గురూ బైక్‌లో జీడిపల్లి నుంచి బయలుదేరి సొల్లాపురం చేరుకున్నారు. అర్ధరాత్రి ఆ ఇంట్లోకి చొరబడి రూ.12లక్షలు చోరీ చేశారు. అనంతరం జీడిపల్లి రిజర్వాయర్ వద్దకు చేరుకుని, చోరీ చేసిన సొమ్ములో రూ.50వేలు జానయ్య తన ఇంటి అవసరం కోసం తీసుకుని ఊరెళ్లాడు. మిగతా సొమ్మును పంచుకుందామని మిగిలిన ఇద్దరు భావించారు. అక్కడే ఉంటే పోలీసులు పట్టుకోవచ్చని కర్ణాటకలోని సిరిగుప్పకు బైక్‌లో బయల్దేరారు. చోరీ కేసు ఛేదించేందుకు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు పర్యవేక్షణలో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు, డీ.హీరేహాళ్ ఎస్‌ఐలు నాగమధు, గురుప్రసాద్‌రెడ్డి బృందాలుగా ఏర్పడ్డారు. వారితోపాటు కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, అక్కులన్న, మోహన్‌కృష్ణ, మంజునాథ, కృష్ణారెడ్డి, రంగారెడ్డి కూడా వెళ్లారు. సిరిగుప్ప వైపు వెళ్తున్న దొంగలను కణేకల్లు క్రాస్ సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు.

నిందితులపై పలు కేసులు...

గురునాథం రాజుపై కడప జిల్లా ఎర్రగుంట్ల, కర్నూలు జిల్లా హాలహర్వి పోలీసు స్టేషన్ల పరిధిలో చోరీ కేసులున్నాయి. దండపాణి కార్తీక్‌పై తమిళనాడు రాష్ట్రంలోని పోలూకు, శ్రీపెరంబూరు, కర్ణాటక రాష్ట్రం బొమ్మనహళ్లి, ఏపీలోని వి.కోట స్టేషన్ల పరిధిలో బైక్ చోరీ కేసులున్నాయి.


స్వాధీనం చేసుకున్న నగదు

వేసవి వ్యథలు

- పశువులకు నీరు, గ్రాసం కొరత
- వృథాగా నీటి తొట్టెలు
- ట్రాక్టర్ వేరుశనగ కట్టె రూ.15వేలుపైమాటే

ఓబుళదేవరచెరువు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వేసవి మొదలైతే చాలు మూగజీవాలకు మూగరోధన తప్పడంలేదు. ప్రధాన పంట అయిన వేరుశనగ గత కొన్నేళ్లుగా రైతులను నట్టేట ముంచింది, కనీసం పశువులకు పశుగ్రాసం దక్కలేదు. ఇదిచాలక నీటి సమస్య మరో పక్క వెంటాడుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో పశువులకు గ్రాసం కొరత తీర్చకపోగా, నీటి సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వ పశువుల దాహార్తి తీర్చడానికి ఉపాధి పథకం కింద గ్రామాల్లో పశువులకు నీటితొట్టెలు ఏర్పాటుచేసింది. తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేసింది. మండలంలో 12,162 ఆవులు, 2,794 గేదెలు, 1.73లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీటిలో కొన్ని గ్రాసం, నీటి కొరతతో మృత్యువాత పడ్డాయి.

● వృథాగా నీటి తొట్టెలు:
గత టీడీపీ ప్రభుత్వం పశువుల దాహార్తి తీర్చడానికి ఒకొక్క తొట్టెని రూ.25వేలతో ఉపాధి పథకం కింద నిర్మించారు. అయితే గత వైసీపీ పాలనలో పశువుల నీటి తొట్టెలకు చుక్కనీరు కూడా అందించలేదు. దీంతో అవి నెర్రెలు చీలి శిథిలావస్థకు చేరుకున్నాయి.

● గ్రాసం కొరత
వేసవి కాలం మొదలైతే చాలు పశువులకు గ్రాసం కొరత తీవ్రంగా ఉంటోంది. ప్రధాన పంట అయిన వేరుశనగా కొన్నేళ్లుగా దిగుబడి రాకపోగా పశువులకు మేతకూడా కరువైంది. తప్పనిసరి పరిస్థితులో పాడిరైతులు, గొర్రెల యజమానులు జొన్నసొప్ప, ఉలవకట్టి, బోరుబావుల కింద సాగుచేసి వేరుశనగ కట్టెను అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం ట్రాక్టర్ వేరుశనగ కట్టె కొనాలంటే రూ.15వేలు పెట్టాల్సి వస్తోంది. గత్యంతంలేక కన్నబిడ్డలా చూకున్న పాడి ఆవులను అమ్ముకోవాల్సి వస్తోందని పాడి రైతులుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత గ్రాసం కేంద్రాలను ఏర్పాటుచేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



గడ్డి కోసం వెంపర్లాడుతున్న గొర్రెలు



వెంకటాపురంలో వృథాగా ఉన్న పశువుల నీటి తొట్టె



గ్రాసం ఉచితంగా ఇవ్వాలి

పశువులకు గ్రాసం కొరత ఏర్పడింది. గ్రాసం కొరతతో అధిక ధరలు పెట్టి పొరుగు గ్రామాల నుంచి కొనుగోలు చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఉచిత పశుగ్రాసం కేంద్రాలను ఏర్పాటు చేసి పాడి రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి.

-రామాంజనేయులు, ఎం.కొత్తపల్లి



నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలి

వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. మూగజీవాలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయి. గతంలో నిర్మించిన నీటితొట్టెలు ఉపయోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో పశువులకోసం నీటితొట్టెలు ఏర్పాటు చేయాలి.

- వెంకటరమణ, గొర్రెల కాపరి, నారప్పగారిపల్లి

గడ్డి గింజలు పంపిణీ చేశాం

పశుగ్రాసం కొరత తీర్చేందుకు ఇటీవల 75 శాతం సబ్సిడీతో 1500 కిలోల గడ్డి గింజలను రైతులకు అందించాం. అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి మరిన్ని గింజలు తెప్పిస్తాం. పశువుల నీటితొట్టెలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుర్తించాం. త్వరలో చర్యలు తీసుకుంటాం.

-ప్రవీణ్‌కుమార్, పశువైద్యాధికారి

విద్యార్థులతో కూలి పనులు

గాండ్లపెంట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.ఐదు లక్షలతో ఇండోర్ స్టేడియం నిర్మాణం, క్రీడా మైదానం మరమ్మతులకు విడుదల చేశారు. ఆ పనుల నిర్వహణ బాధ్యతను పీఈటీలు పాపారాయుడు, హరిప్రసాద్ అప్పగించారు. ఈ పీఈటీలు కొన్ని పనులను కూలీలతో చేయించకుండా.. విద్యార్థులతో నాలుగు రోజుల నుంచి చేయిస్తున్నారు. విద్యార్థులతో మైదానంలోని గుంతలు పూడిపించడం.. మట్టి వేసి చదును చేయించడం.. చెత్తచెదారాన్ని తొలగించడం.. సూచికలు ఏర్పాటు చేయడం.. గుంతలు తవ్వడం... తదితర పనులు చేయిస్తున్నారు. అది కూడా ఆ విద్యార్థులతో తరగతులను ఎగ్గొటించి.. మండుటెండలో నాలుగు రోజుల నుంచి ఈ పనులు చేయిస్తున్నారు. పీఈటీలు చెట్టకింద సేదతీరుతూ... విద్యార్థులతో మండుటెండలో పనులు చేయిస్తున్నారు. కూలీలను పడితే డబ్బులు ఖర్చు అవుతాయని, విద్యార్థులతో ఈ పనులు చేయిస్తున్నారు. ఈ విషయం ఆంధ్రజ్యోతి కంట మంగళవారం పడింది. దీనిపై హెచ్‌ఎం సిద్దారెడ్డిని వివరణ కోరగా.. సరస్వతి పూజ బుధవారం నిర్వహిస్తున్నామని, దీంతో విద్యార్థులతో మైదానాన్ని శుభ్రం చేయిస్తున్నామని, ఇంక నుంచి అలాంటి పనులు చేయించబోమని అన్నారు.





మండుటెండలో పనులు చేస్తున్న విద్యార్థులు

ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభమయ్యేనా..?

కొత్తచెరువు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో 2014లో టీడీపీ ప్రభుత్వం రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నాటి ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి భూమిపూజ చేసి ఆ పనులను ప్రారంభించారు. ఈ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు పిల్లర్ల వరకు జరిగాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే ఇండోర్ స్టేడియం నిర్మాణానికి నిధులు చేయలేదు. దీంతో ఆ పనులు ఆగిపోయాయి. ఇటీవల జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన అక్షరమే అండగా - పరిష్కారమే అజెండా కార్యక్రమంలో ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంగన్న ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డిని విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఇండోర్‌స్టేడియం నిర్మాణానికి నిధులు కూడా కేటాయిస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.



కొత్తచెరువులో నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ధర్మవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఐదుగురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.87 లక్షలు మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. కొత్తపేటకు చెందిన షేక్ బాబా ఫక్రుద్దీన్‌కి రూ.42,951, బ్రాహ్మణవీధికి చెందిన మాదినేని వెంకటనాయుడికి రూ.36,666, శివానగర్‌కు చెందిన సాయిప్రతాప్‌నాయుడికి రూ.32,500, తిక్కస్వామినగర్‌కు చెందిన ఉక్కిసిల సిందుకు రూ.1,30,785, బత్తలపల్లికి చెందిన షేక్షాకీర్ బీకి రూ.45 వేలు చెక్కులను పంపిణీ చేశారు.

● సమస్యలు పరిష్కరించండి: 26,31,40 వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఆ ప్రజలు పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించాలని కోరారు. కాలనీల్లో చెత్తాచెదారం తొలగించాలని, మురుగు కాలువలను శుభ్రం చే యించాలని, కాలువలపైన శ్లాబులు వేయించాలని కోరారు. ఎల్‌సీకేపురం నాగులకట్ట వద్ద గొయ్యి తవ్వి వదిలేశారని, శ్మశాన వాటిక కోసం నర్సరీ వెనుక వైపు ఉన్నస్థలం కేటాయించాలని కోరారు. పరిటాల శ్రీరామ్ స్పందిస్తూ.. ఈ సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న పరిటాల శ్రీరామ్



వివరాలు సేకరిస్తున్న అధికారులు

రైతు ఆత్మహత్యపై విచారణ

తనకల్లు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంటపల్లి గ్రామానికి చెందిన రైతు చంద్రశేఖర్ 20 రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న విషయం తెల్సిందే. దీనిపై త్రిసభ్య కమిటీ సభ్యులు తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఏఓ శ్రీహరినాయక్, పోలీసుల ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. మంగళవారం ఆ గ్రామానికెళ్లి రైతు ఆత్మహత్యపై ఆరా తీశారు. ఆ రైతుకు ఎంత భూమి ఉంది... రెండేళ్లుగా ఏఏ పంటలు సాగుచేశారు.. ఎవరి వద్ద అప్పులు తీసుకున్నారు... ఆత్మహత్యకు అప్పులే కారణమా.. మరేమైనా కారణాలు ఉన్నాయా.. అని ఆరాతీశారు. అలాగే కుటుంబ పరిస్థితులపై రైతు భార్య అశ్వనీని అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. వారి వెంట ఆర్ఐ స్వామి, గ్రామస్థులు, రైతు కుటుంబ సభ్యులు ఉన్నారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న జట్కాస్టాండ్ సంఘం సభ్యులు

జట్కాస్టాండ్‌లో నిర్మాణాలకు అనుమతివ్వండి

ధర్మవరంరూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జట్కాస్టాండ్ స్థలంలో జట్కాస్టాండ్లు, వాటిపై తాము ఇళ్లను నిర్మించుకోవడానికి అనుమతులు ఇవ్వాలని జట్కాస్టాండ్ అసోషియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. 1976 నుంచి జట్కాబండి నడుపుతూ జీవనం సాగిస్తున్నామని, తమ తండ్రులతో పాటు తాము కలిసి జట్కాస్టాండ్ స్థలంలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని అధికారులను, పాలకులను కోరుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. సుమారు 45 కుటుంబాలు తరతరాలుగా ఈ వృత్తినే నమ్ముకొని జీవిస్తున్నాయన్నారు. కొంతమంది గత పాలకులు తమ స్థలాన్ని కాజేయాలని చూశారని ఆరోపించారు. ఇప్పటికైనా తమకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

న్యూస్ బాక్స్

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ధర్మవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకురావాలని విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌ను ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సకలరాజ సోమవారం పుట్టపర్తిలో విజ్ఞప్తి చేశారు. జీఓ నెంబరు 117ను రద్దు చేయాలని, మూతబడ్డ 4500 ప్రాథమిక పాఠశాలలను పునఃప్రారంభించాలని ధర్మవరంలో గవర్నమెంట్ ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేయాలని, నిరుద్యోగులకు ప్రతినెల రూ.3వేలు నిరుద్యోగభృతి ఇవ్వాలని, నాడు-నేడు పనులను పూర్తిచేయాలని కోరారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉచిత టైలరింగ్ శిక్షణకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకుడు సుబ్రమణ్యం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలలోపు బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు, బలిజ సామాజిక వర్గానికి చెందిన మహిళలు ఈనెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయం , మునిసిపల్ కార్యాలయం, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. టైలరింగ్ శిక్షణా కాలంలో 75 శాతం హాజరు ఉన్న వారికి కుట్టుమిషన్ ఇస్తామన్నారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలి



మాట్లాడుతున్న వేమయ్య యాదవ్

కదిరిఅర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి.. వాటిని లబ్ధిదారులు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని అండ్‌అండ్‌బీ భవనంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయకనే బ్యాంక్ రుణాలకు కంతులు కట్టాలని నోటీసులు పంపడం దారుణమన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, శ్రీశైలం బ్యాక్ వాటర్ వంద టీఎంసీలను జిల్లాకు కేటాయించాలని, హంద్రీనీవా కాలువలను వెడల్పు చేసి చెరువులకు పిల్ల కాలువల ద్వారా సాగునీరు అందించాలని, ఉపాధి పనులను 200 రోజులకు పెంచాలని కోరారు. ఈకార్యక్రమంలో కదిరిప్ప, రమణ, ఎల్‌వీ రమణ, ఏఐఎస్‌ఎఫ్ మహేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి కాటి కోటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

బత్తలపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో బుధవారం నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. 12న రెడ్డివారి బోనాలు, 13న జలధి పూజ, 14న లంకాదహనం, 15న పన్నేరపు బండ్ల ప్రదక్షణ, 16న ముస్టురులో తిరునాణతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

మే నెలలో చెన్నకేశవ స్వామివి..

ధర్మవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను మే రెండో వారంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ అడహక్ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్ మంగళవారం తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేపట్టామన్నారు. కాగా, ఆ ఏర్పాట్లను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పరిశీలించారు.

స్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

బత్తలపల్లి మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై మహిళ రైతులకు స్థానిక వెలుగు కార్యాలయంలో పీడీ నరసయ్య మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల మార్కెటింగ్‌కు సహకరిస్తామని, ఇందులో శిక్షణ పొందిన వారు తమ పొలాల్లో ఎక్కువగా ద్రాక్ష, అరటి, టమోట సాగు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జివాగ్రో అసిస్టెంట్ మేనేజర్ కుళ్లాయప్ప, ఏసీ సత్యనారాయణ, ఏపీఎం సుదర్శన్‌రాజు పాల్గొన్నారు.

రేషన్ సమస్యలు పరిష్కరించండి: సీపీఐ

ఓబుళదేవరచెరువు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో రేషన్ సమస్యలు పరిష్కరించి.. సరుకులు సక్రమంగా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు... తహసీల్దార్ అనంతాచారిని కోరారు. మంగళవారం ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఎండీయూ వాహనదారులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లడం లేదని, అలా వెళ్లని వారి బిల్లులు నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశించినా.. సివిల్ సప్లయ్ అధికారులు వారికి బిల్లులు చెల్లిస్తూనే ఉన్నారని మండిపడ్డారు. కొన్ని చౌకధాన్యపు దుకాణాల్లో బఫర్ సమస్య ఉందని, బియ్యం తక్కువగా వస్తుండటంతో లబ్ధిదారులను డీలర్లు వెనక్కు పంపుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఈ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చలపతినాయుడు, పూల శ్రీనివాసులు, రత్నాబాయి, రవి, వెంకటరమణ పాల్గొన్నారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకుందాం

ధర్మవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పాత్రికేయులంతా ఐకమత్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించుకుందామని ఏపీయూడబ్ల్యూజే డివిజన్ అధ్యక్షుడు జానపాటి మోహన్, ప్రధానకార్యదర్శి అజయ్‌నాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోతుకుంట రోడ్డులోని ఎస్‌ఆర్‌ఆర్ పంక్షన్‌హాల్ నిర్వహించిన ఏపీయూడబ్ల్యూజే రెవెన్యూ డివిజన్ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. పాత్రికేయులంతా దీర్ఘకాలికంగా నెలకొన్ని సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. విశ్రాంత పాత్రికేయులకు పింఛన్ సౌకర్యంతో పాటు ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య, ప్రైవేటు ఆసుపత్రులలో ఉచిత వైద్యసౌకర్యం కల్పించేలా కృషి చేయాలన్నారు. అనంతరం సీనియర్ పాత్రికేయుడు భుజంగరావును సన్మానించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యుడు జీవీ నారాయణ, సీనియర్ పాత్రికేయుడు బావిశెట్టి, జిల్లా నాయకులు రాంప్రసాద్, మదనాపు రామాంజనేయులు, రమేష్‌నాయుడు, పూలమూర్తి ప్రసాద్, బిల్లే జయశంకర్, పామాల నాగేంద్ర, డివిజన్ నాయకులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, గోల్డ్‌ప్రసాద్, వెంకటనాయుడు, దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

బీసీ బాలుర హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు

ధర్మవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక గుట్టకిందపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌లో కోకో కోలా కంపెనీ వారు రూ.1.50 లక్షలతో వాటర్ ఫిల్టర్, కూలింగ్ మిషన్, వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేసినట్లు ఆ హాస్టల్ వార్డెన్ విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. హాస్టల్‌లో నాలుగు మరుగుదొడ్లను కూడా నిర్మిస్తున్నారన్నారు.

ఫర్నీచర్ వితరణ

ఓబుళదేవరచెరువు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రెస్‌క్లబ్‌కు స్థానికుడు మహబూబ్‌బాషా రూ.5 వేల విలువైన ఫర్నీచర్‌ను మంగళవారం అందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గోపీనాథ్‌రెడ్డి, కుచ్చెపు శ్రీనివాసులు, భుజంగరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

సెల్‌ఫోన్ చోరీ

ఆపై ఫోన్ పే ద్వారా రూ.1.82 లక్షలు వాడకం

బత్తలపల్లి మార్చి 11(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లె వాసి అయ్యప్పకు చెందిన సెల్‌ఫోన్‌ను దుండగులు చోరీ చేయడమే కాకుండా.. ఆ ఫోన్‌లోని ఫోన్‌పే ద్వారా రూ.1.82 లక్షలను వాడేసుకున్నారు. అయ్యప్ప ఈనెల ఎనిమిదో తేదీన స్థానిక ధర్మవరం రోడ్డులోని ఓ ఎలక్ట్రికల్ షాపు వద్ద ఉండగా.. అతని సెల్‌ఫోన్ చోరీకి గురైంది. మంగళవారం అనుమానం వచ్చిన అతను బ్యాంకుకు వెళ్లి.. తన అకౌంటులో నగదు చూసుకోగా.. అందులో విడతల వారిగా 1,82,000 తన సెల్ ఫోన్‌లోని ఫోన్‌పే ద్వారా వినియోగించుకున్నట్లు గుర్తించారు. దీనిపై ఆయన స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు.

నాటుసారాను విక్రయిస్తే కఠిన చర్యలు

ధర్మవరంరూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నాటుసారాను విక్రయించినా, తాగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0లో కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఓబుళనాయునిపల్లి తండా, నేలకోట తండా, మల్లేనిపల్లి గ్రామాల్లో నాటుసారా ద్వారా కలిగే అనర్థాలను, నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎక్సైజ్ ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: నాటుసారా నిర్మూలనకు అన్నిశాఖల సమన్వయంతో కృషి చేద్దామని ఎక్సైస్ సీఐ వీరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నవోదయం 2.0పై అవగాహన కల్పించారు. నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం విక్రయించేవారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అశాస్త్రీయ పద్ధతిలో తయారు చేసే ఈ సారాతో వ్యాధి నిరోధిక శక్తి తగ్గి క్షయ, క్యాన్సర్ తదితర వ్యాధులు వచ్చే అవకాశముందున్నారు.కార్యక్రమంలో రెవెన్యూ, అటవీ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా రంగం అభివృద్ధికి సహకరించండి



చేపలచెరువు తవ్వకానికి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తాడిమర్రి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆక్వా రంగం అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలని పీఆర్‌డీఏ పీడీ నరసయ్య కోరారు. మంగళవారం డీపీఎం రామ్మోహన్, సత్యనారాయణతో కలిసి తాడిమర్రిలోని బ్యాంకులను ఆయన సందర్శించారు. నారసింపల్లి, తాడిమర్రి, దాడితోట బ్యాంకు మేనేజర్లతో మాట్లాడారు. చేపల చెరువులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని, ఇందుకు సంబంధించి బ్యాంకర్లు రుణాలు ఇచ్చి సహకరించాలని కోరారు. చేపల చెరువుల తవ్వకానికి తాడిమర్రి మండలం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందన్నారు. ఇందులో సబ్సిడీ 30 శాతం ప్రభుత్వం భరిస్తుందని, మిగిలిన మొత్తాన్ని అర్హులైన రైతులకు బ్యాంకర్లు రుణం కింద మంజూరు చేయాలని కోరారు. ఆ చెరువుల్లో కొరమీను రకం చేపలు పెంచుతారన్నారు. అనంతరం చేపల చెరువు ఏర్పాటుకు పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం రామ్మోహన్, ఏపీఎంలు, హరి, రాజశేఖర్, సాంబశివుడు, సీసీలు పాల్గొన్నారు.

ఘనంగా గ్లకోమా నివారణ వారోత్సవాలు

ధర్మవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గ్లకోమా నివారణ వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి అనురాధ గ్లకోమా వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్లకోమా వ్యాధికి గురైనా వారు నెమ్మదిగా కనుచూపు కోల్పోతారని, ప్రారంభదశలో ఎటువంటి లక్షణాలు కనపడవని, ప్రజలు తరచూ కంటి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కంటి వైద్యనిపుణుడు ఉరుకుందప్ప పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

టెన్త్ విద్యార్థులకు పెన్నుల పంపిణీ


విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

పరిగి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పెన్నులు, రైటింగ్ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఆద్విత ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ సౌజన్యంతో డైరెక్టర్ భానుశ్రీ, భర్త కార్తిక్‌లు ఊటకూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. భానుశ్రీ మాట్లాడుతూ విద్యార్థు లు మంచి ఉత్తీర్ణత సాధించాలని అభిలషించారు. కార్యక్ర మం లో ప్రధానోపాధ్యాయులు మనోజ్ ఆరాధ్య, ఉపాధ్యా యులు హనుమంతరాయప్ప, సుధాకర్‌రెడ్డి, నాగచంద్ర, శోభరాణి, దీప, నరసింహారెడ్డి, సుగుణ, మాధవీలత, వకులాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

వదాన్య టెస్ట్‌లో హాస్టల్ విద్యార్థి ప్రతిభ


అవార్డు అందుకుంటున్న విద్యార్థి ప్రణీత్‌కుమార్

అగళి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధూడి బీసీ హాస్టల్ విద్యార్థి ప్రణీత్‌కుమార్ వదాన్య టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపి, మండల టాపర్‌గా నిలిచాడని ప్రధానోపాధ్యాయుడు దాసేగౌడ్, వార్డెన్ సికిందర్‌బాషా తెలిపారు. అనంతపురంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రణీత్‌కుమార్‌కు ప్రశంసాపత్రంతోపాటు రూ.4వేల నగదు బహుమతిగా అందించినట్లు తెలిపారు. ఈ విద్యార్థి కంబదూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వాడని వారు పేర్కొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి


పంచాయతీ కార్మికులతో జిల్లా కార్యదర్శి రమేష్

సోమందేపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాల పెంపుపై ఈనెల 17న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పాలకులు మారుతున్నారుకానీ, గ్రామపంచాయతీ కార్మికుల జీవితాలు మారడంలేదన్నారు. పంచాయతీ నిధులతోకాకుండా తెలంగాణలో మాదిరి ప్రభుత్వమే కార్మికులకు వేతనాలు అందించేలా జీవో రూపొందించాలన్నారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు నారాయణస్వామి, శ్యాము, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

మడకశిర రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడకలపల్లి గ్రామ సమీపంలో ఎల్లోటీ క్రాస్ హైవే రోడ్డుపై మంగళవారం కేఎస్‌ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఎల్లోటి గ్రామానికి చెందిన శివప్ప గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్లు సమాచారం. స్థానికుల సమాచారం మేరకు తడకలపల్లి నుంచి శివప్ప ఎల్లోటీ గ్రామానికి వెళ్లడానికి హైవేలో ద్విచక్రవాహనంపై క్రాస్ చేస్తుండగా హిందూపురం నుంచి మడకశిర మీదగా పావగడ వెళ్లతున్న కేఎస్‌ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో శివప్ప గాయపడ్డాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి బస్సును స్టేషన్ వద్దకు తరలించారు.

రేపు వార్షికోత్సవం

పెనుకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆల్విన్ కాలనీలోని షిర్డీసాయి, సత్యసాయి, భజనమందిరం 11వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉదయం 5-30నుంచి 6-30వరకు నగర సంకీర్తన, స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, విశేష పుష్పాలంకరణ, మహామంగళహారతి, నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సాయి నామసంకీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి


నరసింహులు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

పెనుకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదంలో మరణించిన మునిసిపల్ కార్మికుడు నరసింహులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు హరి డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం సీఐటీయూ మండల కన్వీనర్ బాబావలి, మునిసిపల్ కార్మిక సంఘం నాయకులతో కలిసి నరసింహులు కుటుంబాన్ని పరామర్శించారు. వారు మాట్లాడుతూ నరసింహులు మరణంతో ఆ కుటుంబం పెద్ద దిక్కుకోల్పోయిందన్నారు. నరసింహులు భార్యకు ఉద్యోగం ఇచ్చి, అతడి ముగ్గురు పిల్లలకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్, కార్పెంటర్ యూనియన్ నాయకులు నరసింహులు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మోహినీ ఉత్సవం


ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చిలమత్తూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కనుమ లక్ష్మీనరసింహ స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి ముందుగా వివిధ పుష్పాలతో అలంకరణ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారు మోహినీ అవతారంలో దర్శనం కల్పించారు. ఈ అపురూప ఘట్టాన్ని దర్శించడానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా గోవిందనామస్మరణలతో మార్మోగింది. అనంతరం భక్తులకు మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఫీజు పోరు పేరిట ధర్నా విడ్డూరం: టీడీపీ


మాట్లాడుతున్న శ్రీనివాసమూర్తి

మడకశిర టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విధ్వంసకర విధానాలతో యువత భవిష్యత్తును అంధకారంలోని నెట్టిన వైసీపీ నేడు ఫీజు పోరు పేరిట ధర్నా చేపట్టడం విడ్డూరంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో విద్యాదీవెన, వసతిదీవెన కింద రూ.4271కోట్లు బకాయిలు పెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మీ అసమర్థత వల్లే కోర్సు పూర్తి అయినా వేలాది మంది విద్యార్థులు ఫీజు బకాయిల వల్ల కళాశాలల నుండి సర్టిఫికెట్లను అందుకోలేకపోతున్నారు. పోస్టు గ్రాడ్యుయేట్ విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేసింది మీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా మార్చి యువతను మత్తులో ముంచింది మీరు కాదా అన్నారు. మీరు పెట్టిన బకాయిలు చెల్లిస్తూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను టీడీపీ ప్రభుత్వం తెస్తోందన్నారు. ప్రైవేట్ రంగంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తుంటే ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి జీర్ణించుకోలేక వైసీపీ యువత పోరు పేరిట ధర్నా చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు.

జగన్ ఇంటి ముందు చేయాలి

హిందూపురం: వైసీపీ చేపట్టే ఫీజు పోరు ధర్నాను జగన్మోహన్‌రెడ్డి ఇంటి ముందు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటాపురం అభి ప్రకటనలో సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలల్లోనే రూ.6.5లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. దీనివల్ల దాదాపు 4లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను మోసం చేసింది జగన్‌కాదా అన్నారు. బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చుని నీచ రాజకీయం నడుపుతూ వైసీపీ దొంగలముఠాకు నాయకత్వం వహిస్తుంది నీవుకాదా అని విమర్శించారు. యువతపోరు అంటూ కొత్త డ్రామాకు తెరలేపడం సిగ్గుచేటన్నారు.

బీద రవిచంద్రకు గుండుమల అభినందన


రవిచంద్రయాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తిప్పేస్వామి

మడకశిరటౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి బీద రవిచంద్రయాదవ్‌కు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అభినందనలు తెలిపారు. నెల్లూరులోని ఆయన స్వగృహంలో మంగళవారం గుండుమల తిప్పేస్వామ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత అయిన బీద రవిచంద్రయాదవ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే కోటాలో శాసన మండలి సభ్యుడిగా అవకాశం ఇచ్చారు. ఏకగ్రీవంగా ఎన్నికైన బీద రవిచంద్రయాదవ్‌కు మాజీ ఎమ్మెల్సీతోపాటు పలువురు నియోజకవర్గం టీడీపీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

లైనింగ్ వేయొద్దు సార్..!

మంత్రి నిమ్మలకు రైతుల వినతి


జలవనరుల శాఖమంత్రి రామానాయుడుకి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, గ్రామస్థులు

అనంతపురం/ఆత్మకూరు, మార్చి11(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు లైనింగ్ వేస్తే పంటలకు నీరందక నష్టపోతామని, సమస్యను పరిష్కరించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి సిద్ధరాంపురం గ్రామస్థులు విన్నవించారు. వెలగపూడిలో మంత్రిని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఒకప్పుడు చుక్కనీరు లేక ఇబ్బందులు పడ్డామని, హంద్రీనీవా నీరు రావడంతో చీనీ, మామిడి, అంజూర, దానిమ్మ పంటలు సాగు చేస్తున్నామని మంత్రికి వివరించారు. హంద్రీనీవా కాలువ 219 కి.మీ. నుంచి 223 కి.మీ. వరకూ తమ భూములు ఉన్నాయని తెలిపారు. ఆ 4 కి.మీ. పరిధిలో అక్కడక్కడ లైనింగ్ వేయవద్దని విన్నవించారు. అలా కుదరకపోతే అక్కడక్కడ ఖాళీగా వదిలినా భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. కాలువకు రెండు వైపులా లైనింగ్ వేసి, ఫ్లోరింగ్ వేయకుండా వదిలేసినా తమ సమస్య పరిష్కారమౌతుందని అన్నారు. రంగంపేట నుంచి తూముచెర్ల వరకూ ఉన్న రహదారిపై కాలువలో నీరు ఉంటే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, కాలువపై వంతెన నిర్మించాలని కోరారు. అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసినవారిలో టీడీపీ కనగానపల్లి మండల కన్వీనర్ యాతం పోతులయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి సుధాకర్ చౌదరి, సర్పంచ్ సోమర చంద్రశేఖర్, హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి తదితరులు ఉన్నారు.

ఫర్నిచర్ వితరణ

ఓబుళదేవరచెరువు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రెస్‌క్లబ్‌కు స్థా నికుడు మహబూబ్‌బాషా రూ. 5 వేల విలువైన ఫర్నీచర్‌ను మంగళవారం అందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గోపీనాథ్‌రెడ్డి, కుచ్చెపు శ్రీనివాసులు, భుజంగరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పునాదుల్లో కంపచెట్లు


సచివాలయ పునాదుల్లో పెరిగిన కంపచెట్లు

గుడిబండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముతుకూరు గ్రామ సచివాలయ పునాదులను ముళ్లకంపలు కమ్మేశాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ భవన నిర్మాణానికి పునాదులు తవ్వి పునాదులు వేసి వదిలి వేశారు. దీంతో సచివాలయ పునాదుల్లో ముళ్లకంపల చెట్లు మొలిచాయి. సచివాలయ నిర్మాణానికి వచ్చిన సిమెంటు బస్తాలను వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు, అధికారులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో సచివాలయ భవన నిర్మాణం పునాదులకే పరిమితమైంది. సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకొని అర్ధంతరంగా ఆగిన సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగుకుంటను పూడ్చి వేయండి


చెత్తాచెదారంతో నిండిపోయిన మురుగు నీటి కుంట

సోమందేపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలాజీనగర్‌లో ఏర్పడిన మురుగు నీటి కుంటను పూడ్చి వేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. ఈమేరకు వారు మంగళవారం తమగోడును పంచాయతీ అధికారులతో వెళ్లబోసుకున్నారు. కొత్తపల్లి మలుపువద్ద మురుగునీరు కొంతకాలంగా నిల్వ ఉంటోందన్నారు. స్థానికులు, షాపు నిర్వాహకులు చెత్త చెదారం వేస్తుండటంతో అది కాస్త కుళ్లి కంపు కొడుతోందన్నారు. ఇందులో పందులు దొర్లుతుండటంతో దోమలు బాగా వృద్ధి చెందినట్లు పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు అందించి వెంటనే చర్యలు చేపట్టాలని వారు కోరారు.

ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయంపై హర్షం

రొళ్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బీసీల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అదనంగా రూ.50వేలు కేటాయించడంపై మండల వక్కలిగ కన్వీనర్ వీఎం పాండురంగప్ప హర్షం వ్యక్తం చేశారు. వన్నారనపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో ఎన్నో నిధులు బీసీలకు కేటాయించారని, టీడీపీ ప్రభుత్వానికి ప్రజలు ఎల్లవేళలా అండగా ఉంటారని పేర్కొన్నారు.

స్టార్టర్ చోరీ


ఖాళీ డబ్బాను చూపుతున్న అధికారి

అమరాపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో పురవర చెరువుకు ఆనుకొని ఉన్న తాగునీటి బోరుకు సంబంధించిన స్టార్టర్‌ను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆరు నెలల కిందట ఇదే విధంగా తాగునీటి బోరు కేబుల్‌వైర్‌ను దొంగలించారని పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు తెలిపారు. ఉదయమే వాటర్‌మన్ తాగునీటి బోరు మోటారును ఆన్ చేద్దామని వెళ్లగా స్టార్టర్‌ను దొంగలించినట్లు గుర్తించారు. ఈవిషయాన్ని పంచాయతీ కార్యదర్శికి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బోరు వద్దకు వెళ్లి పరిసరాలను పరిశీలించగా అక్కడ ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదు. పంచాయతీ కార్యదర్శి గ్రామస్థులతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో పంచాయతీ కార్యదర్శి నరేష్‌తోపాటు ఎంపీటీసీ ఓంకార్‌స్వామి, పంచాయతీ కన్వీనర్ తిప్పజ్జ, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు


ఎస్సీ రైతులకు బ్యాటరీలు, స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న కళాశాల అసోసియేట్ డీన్

మడకశిర రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యంత్రాలు ఉపయోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ సరోజినీ దేవి పేర్కొన్నారు. ఎస్సీ రైతులకు మంగళవారం ఆధునిక యంత్రాల వాడకంపై ఒక్క రోజు శిక్షణా తరగతులు కళాశాలలో నిర్వహించారు. ఈ శిక్షణను వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో, ఎస్సీ ఉప ప్రణాళిక కింద భారత వ్యవసాయ పరిశోధనా మండలి, న్యూఢిల్లీ వారి సౌజన్యంతో నిర్వహించారు. మండలంలోని హరేసముద్రం, ఆర్ అనంతపురం, గౌడనహళ్ళి, చీపులేటి, రేకలకుంట గ్రామాలకు చెందిన 30 మంది ఎస్సీ రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేలా ఆలోచించాలన్నారు. రైతులకు కళాశాలలో ఉన్న ఆధునిక యంత్రాలపై అవగాహన కల్పించారు. అనంతరం బ్యాటరీలు, స్ప్రేయర్లు ఉచితంగా పంపిణీ చేశారు. అధ్యాపకులు కిషోర్, హరిబాబు, ఏఓ తిమ్మప్ప పాల్గొన్నారు.

కియ పరిసరాల్లో పటిష్ట నిఘా: ఎస్పీ


కియ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

పెనుకొండ రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కియ పరిసరాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట నిఘా ఉంచాలని ఎస్పీ రత్న ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. పరిశ్రమ చుట్టుపక్కల గ్రామాల్లో ఎప్పటికప్పుడు గట్టి నిఘా ఉంచాలన్నారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

రొళ్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి నిత్యపూజలు, అర్చనలు, అభిషేకాలు, కలశస్థాపన, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి: ఏఓ


భూసార పరీక్ష పత్రాలు రైతులకు అందజేస్తున్న ఏఓ

మడకశిర రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసే ముందు రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప తెలిపారు. భూసార పరీక్షలు, పంటల సాగుపై ఆర్.అనంతపురం పంచాయతీలోని రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షలు ఆధారంగా పంటల సాగు, ఎరువుల వాడకం ఉండాలన్నారు. దీని వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. మల్బరీ, ఉద్యాన పంటలు సాగుచేసే రైతులు ఒక్క అడుగు నుంచి మూడు అడుగులు లోతు తవ్వి మట్టి నమూనాలు సేకరించాలన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేశారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

రొళ్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లినమడుగు గ్రామానికి చెందిన రైతు రమేష్‌కు చెందిన గడ్డిమి మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటల్లో కాలిపోయింది. వెంటనే గుర్తించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందించారు. వారు వచ్చి మంటలు ఆర్పేలోపు గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. రైతు రమేష్ పాడి ద్వారా జీవనం సాగిస్తున్నాడు. ఎండాకాలం కావడంతో పశువులకు అప్పుచేసి గడ్డిని కొన్నాడు. రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు పేర్కొన్నారు.

మూలనపడ్డ చెత్తసేకరణ సైకిళ్లు


రాళ్లపల్లి సచివాలయం వద్ద మూలనపడిన సైకిళ్లు

గుడిబండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లపల్లి పంచాయతీ కార్యాలయం ముందు చెత్తసేకరణ సైకిళ్లు మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. దీంతో గ్రామాల్లో ఉన్న చెత్తను తరలించేందుకు వీలు కాడం లేదు. సైకిళ్లు మూలనపడినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని మూలనపడ్డ చెత్తసేకరణ సైకిళ్లను మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

పెనుకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా భజన మందిరం ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక సత్యసాయిబాబా భజనమందిరంలో పుట్టపర్తి నుంచి ప్రతినెలా రెండో మంగళవారం వైద్యులు వచ్చి ఉచిత వైద్య సేవలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో క్యాన్సర్, కిడ్నీ, లివర్, పక్షవాతంతో బాధపడుతున్న వారికి వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి పుట్టపర్తికి రమ్మని అక్కడ వైద్య సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ శంకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువత పోరును జయప్రదం చేయండి


పోస్టర్లు విడుదల చేస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ

పెనుకొండ రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ తలపెట్టిన యువతపోరును జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులు, ఉద్యోగులను అంధకారంలో నెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పార్టీ ఆదేశాల మేరకు బుధవారం పుట్టపర్తిలో ధర్నా నిర్వహిస్తామన్నారు. ఉదయం 10గంటలకు నిర్వహించే యువతపోరు కార్యక్రమానికి మండల వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ బోయ నరసింహులు, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు ప్రకాశ్‌రెడ్డి, గంపల రమణారెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.